క్లుప్తంగా

మార్కెట్ యార్డు ఎదుట రైతుల ఆందోళన



కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, చందర్లపాడు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పెసర పంట దిగుబడులను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. పెసలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గురువారం కంచికచర్ల, వీరులపాడు మండలాల రైతులు నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం క్వింటా పెసర (సూపర్ డీలక్స్)రూ.8,500లకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా పెసర పంట దిగుబడి సగానికి పైగా దక్కిందన్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ. 6,500 ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. క్వింటాను రూ.9వేలకు పైగా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతులు దేవిరెడ్డి గోపాలరావు, కొమ్మినేని రాజా, బొక్కిసం నాగభూషణం పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈసమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

అందరూ మొక్కలు నాటాలి



నందిగామటౌన్:స్వచ్ఛత ప్రతిఒక్కరి జీవితంలో అంతర్భాగం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పట్టణ శివారు చిన్నబ్రిడ్జి వద్ద గురువారం స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చన్నారు. అనంతరం ఆమె మొక్క నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

నందిగామ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధిపథంలో నడిపించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో ప్రసాదరావు సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఎంపీపీ పెసరమల్లి రమాదేవి, ట్రైనర్ రమేష్, ఆయా మండలాల ఎంపీపీలు, ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నందిగామరూరల్:చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా రుగ్మతలు లేని జీవన విధానాన్ని కొనసాగించవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మండలంలోని అంబారుపేట గ్రామాలలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకట్రావమ్మ, కరుణకుమారి, తారాబీ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై మున్సిపల్ చైర్మన్ అసంతృప్తి



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోకి కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో గురువారం సీఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. సీఆర్‌డీఏ పరిధిలోని పురపాలక సంఘాల్లో మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కన్సల్టెంట్‌లుగా ఉన్న ఆర్వీ కన్సల్టెన్సీ అధికారులు, సీఆర్‌డీఏ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా కన్సల్టెంట్స్ తరపున హర్బజన్ సింగ్, కనకతివారీ మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జగ్గయ్యపేట స్థితి గతులు, అభివృద్ధికి అవకాశం ఉన్న పలు ప్రతిపాదనలను తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ సీఆర్‌డీఏ పరిధిలో జగ్గయ్యపేట పురపాలక సంఘాన్ని చేర్చడం ద్వారా ప్రత్యేక ప్రయోజనాలు లేవని సమావేశంలో పేర్కొనడం గమనార్హం. సమావేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలు: కాత్యాయనీదేవి అలంకరణలో అమ్మవారు



వత్సవాయిలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు




కంచికచర్ల కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ...



లింగాలపాడు: కాత్యాయనీదేవిగా దర్శనమిస్తున్న పేరంటాళ్లుఅమ్మవారు



నందిగామలో కాత్యాయనీదేవిగా దర్శనమిస్తున్న మరిడీ మహాలక్ష్మి



పేటలో కాత్యాయనీదేవి అలంకారంలో అమ్మవారు

కాత్యాయనీదేవిగా అమ్మవారు

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు గురువారం కనకదుర్గమ్మ అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెనుగంచిప్రోలులోని తూర్పుబజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరి, పాత సినిమాహాల్ సెంటర్, డౌన్ సెంటర్‌లో అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ జంగం శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పి.వెంకటరమణ, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, నవాబుపేట, ముండ్లపాడు గ్రామాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి:దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం కాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కాత్యాయనిగా అమ్మవారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చిట్టేల వెంకటేశ్వరస్వామి ఆలయం, మక్కపేట ఆంజనేయస్వామి, మంగొల్లు శివాలయాల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అలంకరించిన చీరలను ప్రతిరోజూ రాత్రి పూజా కార్యక్రమాలు ముగిశాక వేలం నిర్వహిస్తుండగా, ఆ చీరలను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడుతున్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని కాత్యాయని దేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఫైర్‌స్టేషన్ రోడ్డు, వసంతకాలనీ కమ్యూనిటీ హాల్, శివసాయిక్షేత్రంలో అమ్మవార్లను కాత్యాయినీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

నందిగామ మండలంలో..

నందిగామ రూరల్: నందిగామ నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక మంటపాలలో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలకు గురువారం ప్రత్యేకాలంకరణలత పాటు విశేష పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారిని ఆలయ అర్చకులు అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో సీతారావమ్మ, ఆలయ చైర్మన్ మంచాల మాధవరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దాములూరు కూడలిలోని సంగమేశ్వర స్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేశారు. గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి వారి ఆలయంలోని పార్వతీఅమ్మవారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లు, చందాపురంలోని ప్రసన్నాంజనేయసామి వారి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత కాత్యాయినిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నందిగామ పట్టణంలో..

నందిగామ టౌన్: పట్టణంలోని ప్రధాన ఆలయాలతో పాటు ఆయా ప్రధాన వీధుల్లో ప్రత్యేక మండపాలలో ఏర్పాటు చేసిన అమ్మవార్లకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు.రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మి అమ్మవారిని ఆలయ అర్చకులు కాత్యాయనీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలతో పాటు శ్రీచక్ర నవవర్ణార్చన మూలమంత్ర హోమాది క్రతువులను వేదోక్తంగా జరిపించారు. రామలింగేశ్వర నగర్‌లోని సాయి అయ్యప్ప ఆలయం, నెహ్రూనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం, కనకదుర్గ నగర్, రెవెన్యూ కాలనీలోని ఆయా ఆలయాల్లో ఉన్న అమ్మవార్లను కాత్యాయనీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాదేవి గురువారం భ్రమరాంబికాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని పలుగ్రామాలతోపాటు వేదాద్రి, తిరుమలగిరి, ముక్త్యాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాతను అర్చకులు భ్రమరాంబికాదేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నాలుగవ రోజున అమ్మవారు కాత్సాయనీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీచండీ మూలమంత్రసహిత రుద్రహోమం, శ్రీకాత్సాయని కుంకుమపూజ చేశారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో గోపూజ, సామూహిక కుంకుమార్చన, రథత్సవం నిర్వహించారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో, చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అద్దాల బజారులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కాత్యాయనీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. తోటబజారులోని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో, మార్కండేయబజారులోని యూత్ సభ్యులు ఏర్పాటుచేసిన మండపంలో అమ్మవారు శ్రీలలిత త్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

వీరులపాడు మండంలో..

వీరులపాడు: నరసింహారావుపాలెంలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరీదేవి సహిత అమరలింగేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారిని గురువారం కాత్యాయనీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అల్లూరులోని సీతారామచంద్ర స్వామి సహిత మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త అల్లూరు భాస్కరరావు, అంజనాదేవి దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలు అందజేసి విశేష పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వీరులపాడు: నరసింహారావుపాలెంలో



వేదాద్రిలో భ్రమరాంబికాదేవి అలంకారంలో...



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న అధికారులు, భక్తులు



పేటలో నకాశిబజారులో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ప్రజా ఉద్యమకారుడు 'సూర్యదేవర'

నందిగామటౌన్: బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటూ ఎన్నో ప్రజాఉద్యమాలకు నాంది పలికిన కమ్యూనిస్టు నాయకుడు సూర్యదేవర నాగేశ్వరరావు నందిగామ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని సీపీఐ పార్టీ నియోజకవర్గ నాయకుడు వట్టికొండ చంద్రమోహన్ కొనియాడారు. సూర్యదేవర 10వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో గురువారం భారీ ర్యాలీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న సూర్యదేవర నాగేశ్వరరావు విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగేశ్వరరావు చేసిన ఉద్యమాలతో నందిగామలో సీపీఐ నేటికీ బలంగా ముందుకు సాగుతోందన్నారు.



మాట్లాడుతున్న వట్టికొండ చంద్రమోహన్

దేశంలో నక్సలిజాన్ని రూపుమాపుతామని హోం మంత్రి మాట్లాడటాన్ని పలువురు నాయకులు ఖండించారు. కార్యక్రమంలో నాయకులు చుండూరు సుబ్బారావు, అడ్డాడ ప్రసాద్, మన్నెం నారాయణరావు, వల్లంకొండ బ్రహ్మం, పొన్నం నరసింహారావు, చావా రవి, కట్టా చామంతి, మన్నే హనుమంతరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన

నందిగామరూరల్:మహిళల ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, సాధికారతను మెరుగుపర్చడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వస్థ నారి.. సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని వైద్యాధికారులు విజయ్‌కృష్ణ, మనోజ్ తెలిపారు. స్వస్థ నారి.. సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగాలపాడు, గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అంబారుపేట, పల్లగిరి గ్రామాల్లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం శక్తివంతంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా బలవర్ధక ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతతోపాటు అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. మహిళలు, బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి



అంబారుపేటలో అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం బీపీ, షుగర్, ఓరల్, బ్రెస్ట్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చాగంటి రవికిరణ్‌రెడ్డి, ఐలపోగు రమ, సీహెచ్‌వో దివ్యాంజలి, ఏఎన్‌ఎం సైదమ్మ, అంగనవాడీ, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలం

వీరులపాడు:ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని జుజ్జూరులోని జల్లి ఏసోబు కళ్యాణ మండపంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలకు పత్తి, మొక్కజొన్న, వరి, మినుము, పెసర తదితర పంటలు దెబ్బతినగా రాష్ట్రప్రభుత్వం పరిహారం అందించలేదన్నారు. వ్యవసాయాధికారి జోగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని కావాలనే కొందరు రైతులు యూరియా కొరతపై దుష్ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించడంతో ఎంపీపీతో పాటు ఎంపీటీసీ సభ్యులు వ్యవసాయాధికారి మాటలను తీవ్రంగా ఖండించారు. యూరియా కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటే రైతులను అపహాస్యం చేసేలా మాట్లాడటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. పారు. వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించి ఆదుకునేలా చూడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలు తీర్మానాలను సభ్యులను ఆమోదించినట్లు ఎంపీడీవో రూపవతి తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, వైస్ ఎంపీపీ వేమూరు ఆదాం, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, తోట నారాయణరావు, శీలం రమణారెడ్డి, పల్లెపోగు మార్తమ్మ, మోంద్రు బాయమ్మ సర్పంచ్ బందెల రాణి, వైద్యాధికారి రవికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఏవో జోగేంద్రప్రసాద్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



వత్సవాయిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పేటలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



గోళ్లమూడిలో పూజలు చేస్తున్న మహిళలు

వత్సవాయి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సాయంత్రం సమయాల్లో మహిళలు రంగు రంగుపూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒకచోట చేర్చి బతుకమ్మ పాటలతో ఆడిపాడుతున్నారు. అనంతర బతుకమ్మలను స్థానికంగా ఉన్న చెరువులు, కాలువలు, మునేటిలో నిమజ్జనాలు చేస్తున్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు గురువారం రాత్రి స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అత్యంత వైభవంగా సాగాయి. రంగురంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు, బతుకమ్మ కమిటీ సభ్యులు పూజలు చేశారు. బతుకమ్మ గేయాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు.కమిటీ ప్రతినిధులు కొప్పు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చక్కా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో...

నందిగామరూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాలలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. మండలంలోని గోళ్లమూడి, నందిగామ, చందాపురం, ఐతవరం, అంబారుపేట, లింగాలపాడు తదితర గ్రామాలలో మహిళలు, యువతులు పెద్దసంఖ్యలో పాల్గొని బతుకమ్మలాడుతున్నారు. ముందుగా పలు రకాల పూలతో సాంప్రదాయబద్ధంగా బతుకమ్మను పేర్చి గౌరీ పూజ చేశారు. అనంతరం ఆట పాటలతో సందడి వాతావరణంలో ఆయా గ్రామాల సమీపంలోని చెరువులు, వాగులు, నదులలో బతుకమ్మను నిమజ్జనం చేసి సాగనంపుతున్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు



నందిగామరూరల్:గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో ప్రసాదరావు తెలిపారు. మండలంలోని పెద్దవరంలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల్లో పూడిక తీయించడంతోపాటు బ్లీచింగ్ చల్లించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యదర్శి సీతారామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నందిగామటౌన్:చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే సమస్యలను పరిష్కరించుకునే మార్గం సులభతరమవుతుందని నందిగామ ప్రిన్సిపల్ జూనియన్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, 16వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పడగాల శ్రీనివాసరావు ఉత్తర్వుల మేరకు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో గురువారం నల్సా జాగృతి–2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనం కొనుగోలు చేసేవారు విధిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రామిశరీ నోటు రాసే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఖాళీ ప్రామిశరీ నోటు, చెక్కులపై సంతకాలు చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బందారు శుభాకరరావు, కన్నెకంటి జీవరత్నం, ఈశ్వరప్రడ రంగారావు, అడ్డకి మణిబాబు, మన్నెం నారాయణరావు, యరగొర్ల రామారావు, జాగృతి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి షేక్ రియాజ్

స్విమ్మింగ్ పూల్ పునఃప్రారంభం



జగ్గయ్యపేటఅర్బన్ :పట్టణంలోని కోదాడ రోడ్‌లో మున్సిపల్ ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి గురువారం పునఃప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రతో కలిసి శాప్(స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) అధికారులతో మాట్లాడి మున్సిపల్ ప్రత్యేక నిధులు ఉపయోగించి స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు పూర్తిచేసినట్లు తెలిపారు. స్విమ్మింగ్ పూల్ లీకేజీ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. స్విమ్మింగ్ ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కోచ్ పాండురంగారావు ఆధ్వర్యంలో పురుషులు, మహిళలకు ప్రత్యేక శిక్షణను త్వరలోనే ప్రారంభిస్తామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, సొసైటీ అధ్యక్షుడు దూళిపాళ్ల లక్ష్మణరావు, కౌన్సిలర్లు సామినేని మనోహర్, ఇర్రి నరసింహారావు, గింజుపల్లి వెంకట్రావు, టీడీపీ నాయకులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.